క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



కేస్లాగూడ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

కెరమెరి: పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని డీఎల్‌పీవో ఒమర్ హుస్సేన్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులకు గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు ఉండేలా చూడాలన్నారు. మోడల్ పోలింగ్ కేంద్రాలను అందంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం కేస్లాగూడ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో క్రిష్టారావు, ఎంపీవో అంజద్ పాషా ఉన్నారు.

ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదాం

తిర్యాణి: బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో 'అవినీతి ఊబిలో కూరుకుపోయిన బీజేపీ ప్రభుత్వం' అనే పుస్తకాన్ని సీపీఐ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఎదులపహడ్, బోరింగూడ, సుంగాపూర్ గ్రామాల్లో ఇండియా కూటమి అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కుతో బీజేపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్, జిల్లా కార్యదర్శి మొగిలి తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర'



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

దహెగాం: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తుందని కాంగ్రెస్ మండల నాయకులు ఆరోపించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ ద్వారా అన్నివర్గాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. నాయకులు తోగయ్య, సంతోష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

బెజ్జూర్: మండలంలోని ఏటిగుడ గ్రామంలో మడే (మాకిడి) అమ్మక్క అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాలతోనే నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం ద్వారా సహాయ సహకారం అందిస్తామన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీవర్ధన్, నాయకులు నరేందర్ గౌడ్, జావిద్, మహేశ్, సెండే బాబురావు, షౌకత్ అలీ ఖాన్, గంగన్న, అమీరుద్దీన్, తాజుద్దీన్, విష్ణుమూర్తి, రషీద్, హనుమంతు, కృష్ణ, వెంకటి, రాములు, రోశయ్య, శంకర్, రాకేశ్, రోషన్, రోహిత్ ఉన్నారు.

నేడు బీజేపీ బహిరంగసభ

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్‌లోని మెయిన్ మార్కెట్‌లో శుక్రవారం బీజేపీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. బీజేపీ ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం 6 గంటలకు బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సభకు రాష్ట్ర నాయకులు చీకోటీ ప్రవీణ్‌తోపాటు రాజస్థాన్ ఎమ్మెల్యే గోవర్ధన్ వర్మ హాజరవుతారని తెలిపారు. బీజేపీ కార్యకర్తలు, అభిమానులు సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

పోచమ్మకు జలాభిషేకం

తిర్యాణి: వాతావరణం చల్లబడాలని మండలంలోని చింతపెల్లి పంచాయతీ పరిధిలోని నాయకపుగూడ గ్రామస్తులు గురువారం పోచమ్మ అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పిండివంటలతో సిద్ధం చేసిన నైవేద్యాలను సమర్పించారు.

పల్లెల్లో 'మత్తు' జోరు!

- బెజ్జూర్‌లో వైన్స్ సీజ్
- పెరిగిన గుడుంబా అమ్మకాలు
- దుకాణాల్లో అధిక ధరలకు మద్యం విక్రయం



ఇటీవలే సీజ్ చేసిన బెజ్జూర్‌లోని వైన్స్‌షాప్

బెజ్జూర్: మండలంలో గుడుంబా గుప్పుమంటుంది. పల్లెల్లో నాటుసారా తయారీ, విక్రయాలు జోరందుకుంటున్నాయి. మండలకేంద్రంతో మొదలుకొని 22 పంచాయతీల్లో కిరాణా దుకాణాలు ఏర్పాటు చేసుకుని మద్యం, గుడుంబా విక్రయాలు సాగిస్తున్నారు. లంబాడిగూడ నుంచి బైక్‌లపై ప్యాకెట్ల ద్వారా గ్రామాల్లో విక్రయదారులకు చేరవేస్తున్నారు. మహారాష్ట్రకు ఆనుకొని ఉన్న గ్రామాల్లో ఈ దందా సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మద్యం షాప్ సీజ్‌తో..

అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న బెజ్జూర్ మండల కేంద్రంలోని వైన్స్ షాపును వారం క్రితం రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కేసు నమోదు చేసి సీజ్ చేసిన విషయం తెలిసిందే. దీన్ని అదునుగా చేసుకుని కొందరు గుడుంబా తయారీ చేసి గ్రామీణ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. మర్దిడి గ్రామంతోపాటు ఇతర ప్రాంతాల్లో విక్రయాలు అరికట్టాలని పలువురు మహిళలు గతంలో బెజ్జూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, బెజ్జూర్‌లోని వైన్స్ షాపు బంద్‌తో పెంచికల్‌పేట, గూడెం, రవీంద్రనగర్ తదితర గ్రామాల నుంచి దళారులు మద్యం తీసుకువచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఒక్కో బీరు రూ.250 నుంచి రూ.260 వసూళ్లు చేస్తున్నారు.

హానికరమైన పదార్థాలతో తయారీ..

అత్యంత హానికరమైన పదార్థాలతో నాటుసారా తయారీ చేస్తున్నారు. బెల్లం, పటిక, యూరియా, కుళ్లిపోయిన పండ్లు, అరటితొక్కలు, చివరికి తోలుచెప్పులను ఆయా పదార్థాలతో పులియబెట్టి గుడుంబా కాస్తున్నారు. మత్తు వచ్చేలా కొందరు ఎండ్రీన్ సీసాలో చీపురుపుల్లను ముంచి కలిపేస్తున్నారు. ఇంత జరుగుతున్నా గ్రామాల్లో ఎక్సైజ్, పోలీసుల ఆడపాదడపా దాడి చేసినట్లు చేసి మమ అనిపిస్తున్నారు. వాహనాల తనిఖీల్లో పట్టుబడుతున్న గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారే తప్పా చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై ఎస్సైని విక్రమ్‌ను వివరణ కోరగా.. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నుంచి ఇప్పటివరకు 18 కేసులు నమోదు చేశామని, గుడుంబా విక్రయదారులు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. జనవరి నుంచి ఏప్రిల్ వరకు కాగజ్‌నగర్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని మొత్తం ఏడు మండలాల్లో కలిపి 53 నాటుసారా కేసులు, 55 మంది అరెస్టు, 382 లీటర్ల నాటుసారా, 65,700 లీటర్ల బెల్లం పానకంతోపాటు నాటుసారా రవాణా చేస్తున్న 12 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు.

'ఆత్రం సక్కును గెలిపించాలి'



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

బెజ్జూర్: పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ కోరారు. మండల కేంద్రంలో గురువారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ఓట్లు అభ్యర్థించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రెబ్బెన: కాంగ్రెస్ ఆగడాలను అరికట్టాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ఎంపీపీ సౌందర్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి కోరారు. ఎడవెల్లిలో గురువారం బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి ఆత్రం సక్కును గెలిపించాలని ఓటర్లను కోరారు. పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, నాయకులు అజయ్ జైస్వాల్, పల్లె రాజేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం అన్నారు. మండలంలోని రాంనగర్, కొఠారి, రింగస్‌ఘాట్, గోయగాం తదితర గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. నాయకులు తదితరులు ఉన్నారు.

ఆకుసేకరణతో ఉపాధి



పెంచికల్‌పేట్: అటవీ ప్రాంతాల్లోని గిరిజనులకు తునికాకు సేకరణ ఉపాధిగా మారింది. పెంచికల్‌పేట్ యూనిట్‌లోని కొండపల్లి, లోడుపల్లి, మెరెగూడ, అగర్‌గూడ, నందిగామ, కమ్మర్‌గాం, గుండెపల్లి, మురళీగూడ గ్రామాల్లో తునికాకు సేకరించడానికి కల్లాలు ఏర్పాటు చేశారు. వేకువజామునే గ్రామాల నుంచి ప్రజలు ఎడ్లబండ్ల ద్వారా అటవీ ప్రాంతాలకు చేరుకుని తునికాకు సేకరిస్తున్నారు. వీటిని కట్టలు కట్టి కల్లాల్లో విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ఒక్కో 50 ఆకుల కట్ట ధరను రూ.3 నిర్ణయించింది. దీంతో వేసవిలో అటవీ సమీపప్రాంతాల ప్రజలకు ఉపాధి లభిస్తుంది.

జొన్న కోతలు షురూ..!



సాకడలో కొనసాగుతున్న జొన్న కోతలు

- మండలంలో 2,448 ఎకరాల్లో సాగు
- పంట సాగుకు రైతుల ఆసక్తి



కట్టలు కట్టేందుకు సిద్ధంగా ఉన్న జొన్న

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాల్లో జొన్న కోతలు ప్రారంభమయ్యాయి. వానాకాలంలో పత్తి సాగు చేసిన రైతులు పంట చేతికి వచ్చాక జొన్న, మొక్కజొన్న సాగు చేశారు. మండలంలో మొత్తం 31 పంచాయతీలు ఉన్నాయి. 8,194 మంది రైతులు ఉండగా..29,456 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. గతేడాది వెయ్యి ఎకరాల్లో లేని జొన్న ఈసారి 2,448 ఎకరాల్లో సాగైంది. 200 ఎకరాల్లో మొక్కజొన్న వేశారు. ప్రస్తుతం వర్షాలు కురవకపోయినా ఆరుతడి పంటల్లో భాగంగా మొక్కజొన్న పండిస్తున్నారు. గ్రామాల్లో 500కు పైగా మంది రైతులు తమ పొలాల్లో బోర్లు వేసి జొన్న పండించారు. ప్రస్తుతం మార్కెట్‌లో జొన్న ధర కిలో రూ.40 నుంచి 45 పలుకుతున్నాయి. అయితే అనేక మంది ఆరోగ్య నిమిత్తం జొన్నరొట్టేలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మార్కెట్‌లో వీటికి డిమాండ్ ఉండడంతో పలువురు రైతులు ఆహార పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

రబీకి ధర ఎక్కువ

ఆరోగ్యానికి రబీ జొన్నలు మంచివని భావించిన సుమారు 234 మంది రైతులు సాగు చేశారు. చొప్ప ధర ఎక్కువగానే ఉంటుంది. హైబ్రిడ్ చొప్ప కట్టకు రూ.15 పలికితే..రబీ జొన్నకు రూ.25 నుంచి రూ.30 ఉంది. జొన్నల ధరకు వ్యత్యాసం ఉంటుంది. రబీ చొప్పలను పశువులు తినేస్తాయి. అందుకే ధర అధికంగానే ఉంటుందని అన్నదాతలు చెబుతున్నారు.

పదేళ్లుగా సాగు



నేను పదేళ్లుగా రబీ జొన్న సాగు చేస్తున్నారు. ప్రతీరోజు మార్కెట్‌లో పెరుగుతున్న జొన్న ధరల నేపథ్యంలో కొనుగోలు చేయలేకపోతున్నాం. ఇంట్లో జొన్న రొట్టేలతోపాటు గట్కా ఆరగించడంతో ఆరోగ్యంగా ఉండగలుగుతాం. పశువులకు చొప్పకు కూడా జొన్న పనికి వస్తుంది.

– మొహర్లే భూదేవి, కెరమెరి

ఆహార పంటలు పండించాలి



రైతులు వాణిజ్య పంటలపై మక్కువ చూపుతున్నారు. పత్తి పంటలతో పాటు జొన్న, మొక్కజొన్న, కంది, పెసర వంటి ఆహార పంటలను పండించాలి. సాగు భూమిలో కనీసం నాలుగో వంతు ఆహార పంటల కోసం కేటాయించాలి.

– ఎస్.గోపీకాంత్, ఎంఏవో



విరిగిన భారీ వృక్షం

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్–1, రవీంద్రనగర్–2 గ్రామాల మధ్య గురువారం ఈదురుగాలులకు భారీ వృక్షం విరిగి రోడ్డుపై పడింది. దీంతో రెండు గ్రామాల సుమారు గంటపాటు రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామానికి చెందిన పలువురు రోడ్డుపై ఉన్న చెట్టును తొలగించడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి. పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో పలువురు వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉత్సవాలు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి వైశాఖ మాస ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకుడు బాలక్రిష్ణ ఆధ్వర్యంలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి కుంకుమ పూజ అభిషేకంతో పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 18న శ్రీ వాసవి జయంతి, అమ్మవారికి విశేషపూజలు, అర్చన, శోభయాత్ర, ఉంజలి సేవ, 23న శాకంబరి ఉత్సవం, జూన్ 2న దీపోత్సవం, జూన్ 6న లక్షపుష్పార్చన తదితర ప్రత్యేక కార్యక్రమాలుంటాయని ఈవో ముక్తారవి తెలిపారు. స్థానిక అమ్మవారిని వాసవి క్లబ్ సభ్యులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'ఆత్రం సుగుణను గెలిపించాలి'



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు



తలోడిలో ప్రచారం నిర్వహిస్తున్న కౌటాల కాంగ్రెస్ నాయకులు



కెరమెరి: కొలాంఝరిలో మాట్లాడుతున్న కుసుంబ్‌రావు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని, ఎంపీ ఎన్నికల్లో పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు కోరారు. కాగజ్‌నగర్ మండలంలోని సార్సాల గ్రామంలోని ఉపాధి హామి కూలీలతో గురువారం ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్న బీజేపీ పేద ప్రజల అభివృద్ధిని గాలికొదిలేసిందన్నారు. ఆత్రం సుగుణ గెలుపు కోసం చేతి గుర్తుకు ఓటు వేయాలన్నారు. నాయకులు సిద్ధిక్, శంకరయ్య, నాగేందర్, తిరుపతి, లక్ష్మణ్, ధనురాజ్, శ్రీకాంత్, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

- ఆత్రం సుగుణను గెలిపించాలని కౌటాల మండల కాంగ్రెస్ నాయకుడు మానిక్ కోరారు. కౌటాల మండలంలోని తలోడి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. నాయకులు దేవయ్య, తిరుపతి, ఎల్లయ్య, రవీందర్‌గౌడ్, బాపు, శ్రీనివాస్, సంతోష్, పోశం తదితరులు పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్: ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కెరమెరి: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మండల అధ్యక్షుడు ఆత్రం కుసుంబ్‌రావు, మార్కెట్ మాజీ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్ అన్నారు. మండలంలోని కొలాంఝరి, జ్యోతినగర్ గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. దండుగుల శ్రీనివాస్, మారుతి, లింబారావు, వెంకటస్వామి, తిరుపతి, కిషన్ రాజు, మోతిరాం, హభగవంత్‌రావు తదితరులు ఉన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామంలో ఆత్రం సుగుణ తరపున కాంగ్రెస్ శ్రేణులు గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండల కోఆప్షన్ సభ్యుడు సాజిద్, నాయకులు దుర్గ రాజన్న, భీమయ్య, రాజేశ్వర్, లాంచు, యువకులు అనిల్, నాగా, హరి, చంద్రశేఖర్, బక్కయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీకి ఓటుతో బుద్ధిచెప్పాలి'



పెంచికల్‌పేట్‌లో ఎన్నికల ప్రచారంలో సీపీఎం నాయకులు

పెంచికల్‌పేట్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కోట సతీశ్ అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ తరపున మండలకేంద్రంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేందుకు యత్నిస్తుందన్నారు. ఎన్నికల్లో బీజేపీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్, నాయకులు చాపిలే సాయికృష్ణ, జాడి మల్లయ్య, రాజేష్ తదితరులు ఉన్నారు.

'బీజేపీని గెలిపిస్తే రిజర్వేషన్లు రద్దు'



గోలేటిలోని కార్మిక క్వార్టర్లలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రెబ్బెన: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలో గురువారం ×గడపగడపకూ కాంగ్రెస్×కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు తొలగించేలా ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. ప్రకాశ్‌రావు, సుదర్శన్‌గౌడ్, సాంబగౌడ్, కిషన్‌గౌడ్, సురేందర్‌రాజు, ప్రభాకర్, సదాశివ్, రవీందర్ పాల్గొన్నారు.

పార్టీల ప్రచారం

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని మోవాడ్, సాలేగూడ, బెల్గాంతోపాటు పలు గ్రామాల్లో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిర్రకుండ, అంకుసాపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, బాబాపూర్, గుండిలో కాంగ్రెస్ తరపున డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఈదులవాడ, కొమ్ముగూడలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ ప్రచారం చేశారు.

కథల పుస్తకాలు చదవాలి



ఫోన్ నంబర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో వెంకటేశ్వరస్వామి

రెబ్బెన: కథలతో కూడిన పుస్తకాలు చదవడం మూలంగా విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందని ఎంఈవో వెంకటేశ్వరస్వామి అన్నారు. మండలంలోని జక్కులపెల్లి ప్రాథమిక పాఠశాలలో రూం టూ రీడ్ స్వచ్ఛందసంస్థ ఏర్పాటు చేసిన ఫోన్ చేయడం ద్వారా కథలను వినే ఫోన్ నంబర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఫోన్ కొట్టి తమకు నచ్చిన కథలను వినే అవకాశాన్ని రూం టూ రీడ్‌సంస్థ ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థులు 040–45209722 నంబర్‌కు ఫోన్ చేసి రోజుకు ఒక కొత్త కథను విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు వినవచ్చని అన్నారు. పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా తమకు నచ్చిన భాషలో కథలన్నీ ఎప్పుడైనా, ఎక్కడైనా చదువుకునే సౌకర్యం ఉందన్నారు. అలాగే కథల పుస్తకాలను చదవడం ద్వారా విద్యార్థులకు కలిగే లాభాలను వివరించారు. సీఆర్పీ రాజేష్, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, కిష్టాపూర్ పాఠశాల హెచ్‌ఎం రవి, రూం టూ రీడ్ సంస్థ సభ్యులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోడం నగేశ్‌ను గెలిపించాలి



ప్రచారం చేస్తున్న నాయకులు

కౌటాల: బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్ కోరారు. మండల కేంద్రానికి సమీపంలో ఉపాధి హామీ పనుల వద్ద గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూలీలతో మాట్లాడారు. బీజేపీ హయాంలోనే అభివృద్ధి సాధ్యమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గోడం నగేశ్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు మధుకర్, చందు, భూమయ్య, అశోక్ తదితరులు ఉన్నారు.